www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 02 | ఫిబ్రవరి | 2026 పేజీలు : 8

# సామాన్యులను విస్మరించిన బడ్జెట్



**-బడ్జెట్‌తో మరింత సంక్షోభంలోకి సాగు**
**-సిపిఐ నేత బాగం**

**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులను పూర్తిగా విస్మరించారని సంపన్న వర్గాలకు ఊతమిచ్చేవిధంగా కేటాయింపులు ఉన్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఈ దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు ఈ బడ్జెట్‌లో ఎక్కడ పరిష్కారం చూపే ప్రయత్నం చేయలేదని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఈ బడ్జెట్ పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తుందని మోడీ ప్రభుత్వం కార్పోరేట్,

మిగతా 2లో..

# ఇంటింటి ప్రచారంలో సిపిఐ

**-కంకి కొడవలి గుర్తుకు ఓటేయాలని విస్తృత ప్రచారం**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిపిఐ అభ్యర్థులు ఇంటింటికి తిరిగి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం కార్పోరేషన్, ఇల్లందు, అశ్వారావుపేట, ఏదులాపురం, వైరా, మధిర, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల్లో సిపిఐ అభ్యర్థులు బరిలో నిలిచారు. కొత్తగూడెం కార్పోరేషన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఏదులాపురం మున్సిపాలిటీలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శులు దండి సురేష్, ఎస్‌కె సాబీర్‌పాషా లు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కంకి కొడవలి గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. సిపిఐ అభ్యర్థులను గెలిపిస్తే నిరంతరం ప్రజల పక్షాన ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని సిపిఐ నాయకులు ప్రజలకు వివరించారు. ప్రజలను విస్మరించి నడుచుకునే కొందరు ఎన్నికల వేళ ప్రజల ముంగిటకు వచ్చి అలవికాని వాగ్దానాలను చేస్తుంటారని అటువంటి వారిని నమ్మవద్దన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే సిపిఐ అభ్యర్థులకే మున్సిపల్ ఎన్నికల్లో పట్టం కట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. పాల్వంచ పట్టణంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల సత్యనారాయణ నేతృత్వంలో సిపిఐ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

## కాంగ్రెస్ గెలిస్తేనే
# పట్టణాల్లో అభివృద్ధి

**-ఐక్యతతో పని చేయండి**
**-సిపిఐ మిత్రపక్షమే : -మంత్రి కొండా సురేఖ**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాలు, నగరాల అభివృద్ధి సత్వరం జరుగుతుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పదేళ్ల గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని సొంత ఆదాయాలను బిఆర్‌ఎస్ నేతలు పెంచుకున్నారని ఆమె తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ

మిగతా 2లో..

## సిట్ నోటీసులపై
# బిఆర్ఎస్ నిరసన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిఆర్‌ఎస్ అధ్యక్షులు కేసిఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసి విచారణకు పిలవడంపై బిఆర్‌ఎస్ శ్రేణులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. ఖమ్మం, కొత్తగూడెం, వైరా, పాలేరు సహా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించి ఆందోళన

మిగతా 2లో..

**-ఖమ్మంలో తీవ్ర ఉద్రిక్తత సిఐకి గాయాలు**
**-దుర్మార్గంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం**
**-తప్పుడు కేసులతో బిఆర్‌ఎస్‌ను అడ్డుకోలేరు**
**-మాజీ మంత్రి పువ్వాడ**

# గోదారి మాతకు నదీహారతి





**- పున్నమి కాంతుల నడుమ హారతి పట్టిన అర్చకులు**
**- ఆకట్టుకున్న భజనలు, భక్తి గీతాలు**
**- హాజరైన భక్తజనం**
**- సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్**

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివారం సాయం సంధ్యవేళ గోదావరి తీరంలో పున్నమి కాంతులు పూసాయి. నదులు ప్రాశస్త్యాన్ని చాటి చెప్పేందుకు ఏర్పాటు చేసిన నదీ హారతి

మిగతా 2లో..

# సామాన్యులను విస్మరించిన బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

సంపన్న వర్గాలకు అనుకూలమని ఈ బడ్జెట్‌తో మరోసారి తేటతెల్లమైందన్నారు. భారతదేశంలో అత్యంత ప్రమాదకర స్థాయికి నిరుద్యోగ సమస్య చేరుకుందని దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న యువత నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతుందని ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలను ఎక్కడ ఈ బడ్జెట్‌లో ప్రస్థావించలేదని హేమంతరావు తెలిపారు. వాస్తవానికి దూరంగా బడ్జెట్‌లో అంకెల గారడీ చేశారు తప్ప మరోకటి లేదన్నారు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజల గురించి ఈ బడ్జెట్‌లో ఎక్కడ ప్రస్థావన లేదన్నారు. ముఖ్యంగా గ్రామీణ పేదలకు సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం పేరును విబి జి రామ్ జీగా మార్చి పూర్తిగా తొలగించే ప్రయత్నాన్ని చేస్తుందని హేమంతరావు తెలిపారు. కేటాయింపులు చేసినప్పటికీ రాష్ట్రాలు 40 శాతం భరించాలని చెప్పటం ద్వారా ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తుందన్నారు. విద్య, వైద్య రంగాలను పూర్తిగా విస్మరించిందని విద్య, వైద్యం లేని భారతదేశం ఎలా పురోగమిస్తుందని ఆయన ప్రశ్నించారు. ఈ దేశంలో ఇప్పటికీ మెజార్టీ ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించారని కేటాయింపులు సరైన రీతిలో లేవని ఆయన తెలిపారు. బడ్జెట్ లెక్కల ప్రకారం రసాయనిక ఎరువుల ధరలు పెరగడంతో పాటు దిగుమతుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు గణనీయంగా పడిపోయే అవకాశం ఉందని హేమంతరావు తెలిపారు. బడ్జెట్‌లో అంకెల గారడీ చేసి రూ.53 లక్షల కోట్లు చూపారు తప్ప ఆదాయ మార్గాలను చూపడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కేవలం అప్పుల వసూళ్లు, ద్రవ్య లోటు బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. 27శాతం అప్పులు వడ్డీలకే సరిపోతుందని దీనితో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎలా చేపడతారని హేమంతరావు ప్రశ్నించారు. అంకెల్లో చూపడానికి తప్ప ఇది ఆచరణ సాధ్యమయ్యే బడ్జెట్ కాదన్నారు. ఈ దేశంలో కార్మిక వర్గాన్ని ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల ప్రస్థావనే లేదని ఇప్పటికే లేబర్ కోడ్స్‌తో స్వేచ్ఛను హరించిన ప్రభుత్వం ఇప్పుడు సంక్షేమాన్ని కార్మికులకు దూరం చేసిందని హేమంతరావు తెలిపారు.వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతే దేశ ఆర్థిక పరిస్థితి మరింత ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటుందన్నారు. తెలంగాణ పట్ల కేంద్ర మంత్రి మరోసారి వివక్షను ప్రదర్శించారని ఆంధ్రప్రదేశ్‌తో పోల్చినప్పుడు కనీస కేటాయింపులు కూడా జరపలేదని ఆయన తెలిపారు. కార్పోరేట్, సంపన్న వర్గాలకు అనుకూల బడ్జెట్ తప్ప ఈ బడ్జెట్‌తో సామాన్యులకు ఒరిగేది ఏమి లేదని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్ గెలిస్తేనే పట్టణాల్లో అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాలను అమలు చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం విజయం సాధించిందని ఆమె తెలిపారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు, రైతు భరోసా, రుణమాఫీ లాంటి కార్యక్రమాలను అమలు చేశామన్నారు. కాంగ్రెస్ నాయకత్వం సూచనలతో అభ్యర్థుల ఎంపిక సజావుగా సాగుతుందన్నారు. వీలైనంత మేర చర్చలు జరుపుతామని రెబల్స్ బెడద లేకుండా చూస్తామన్నారు. అలా జరగని పక్షంలో అధిష్టానానికి సమస్యను వివరించడం జరుగుతుందన్నారు. ఐక్యతతో ఉంటేనే అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తామని గత పంచాయతీ ఎన్నికల్లో మాదిరి మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలో కూడా విజయ పతాకాన్ని ఎగురవేయాలన్నారు. ఒక ప్రశ్నకు సురేఖ సమాధానం ఇస్తూ సిపిఐ ఇప్పటికీ తమ మిత్రపక్షమేనని సీట్ల కేటాయింపుకు సంబంధించి స్థానిక నాయకుల అభిప్రాయాలు ప్రధానమని ఆమె తెలిపారు. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## ఫోటో షూట్‌లో అరుణ్‌కు అవార్డు







**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా వాసీ ఐ మార్క్ జగన్ ఆధ్వర్యంలో మోతుగూడెంలో మూడు రోజుల పాటు జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పాట్ కాంపిటేషన్ నందు ఖమ్మం నగరానికి చెందిన అరుణ్ స్టూడియో అధినేత అరుణ్‌కు మోడ్రన్ ఫోటోగ్రఫీలో అవార్డు దక్కింది. విశాఖపట్నంకు చెందిన ప్రముఖ ఫ్యాషన్ ఫోటోగ్రాఫర్ బికె అగ్రావల్, ఖమ్మం నగర సీనియర్ ఫోటోగ్రాఫర్ సిఎన్‌సి శ్రీనివాసరావు, వర్క్‌షాప్ నిర్వాహకులు ఆధ్వర్యంలో ఐదు రాష్ట్రాలకు చెందిన 50 మంది ఫోటోగ్రాఫర్లు వర్క్‌షాపులో పలు అంశాలపై మేళకువలు నేర్చుకున్నారు. 15 మందికి మూడు విభాగాల్లో అవార్డులు అందించారు. భద్రాచలం సీనియర్ ఫోటోగ్రాఫర్ ఎస్‌కె షరీఫ్ జ్ఞాపకార్థం అవార్డును ప్రదానం చేశారు. ఖమ్మం జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్, కోశాధికారి తిరుపతిరావు లు అవార్డులు గెలుపొందిన ఫోటోగ్రాఫర్లకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో రవికుమార్, ప్రసాద్, పలువురు ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

# గోదారి మాతకు నదీహారతి

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమం ఆద్యాంతం భక్తిభావంతో నిండుకుంది. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ సమీపంలోని గోదావరి కరకట్ట ప్రదేశంలో అంగరంగవైభవంగా నిర్వహించిన గోదావరి నదీ హారతికి సర్పంచ్ పూనెం కృష్ణతో పాటు కలెక్టర్ జితేష్ విపాటిల్ , తహశిల్దార్ దనియాల వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు. అర్చకస్వాములు గోదావరి మాతకు హారతులు పండుతుండగా పున్నమి కాంతుల వెలుతురుకు తోడైన హారతి కాంతులతో భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. అర్చకుల మంత్రోశ్చరణల నడుమ సాగిన ఈ వేడుక అధ్యాంతం ఆకట్టుకుంది. 108 హారతులు, అష్టోత్తర శతనామార్చనల సందడిలో భక్తులు చేసిన రామనామ స్మరణతో గోదావరి తీరం పులకించిపోయింది. ఇందులో భాగంగా రామయ్య తండ్రికి 12 మార్లు, గోదావరి మాతకు 21పర్యాయాలు హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా చిన్నారుల భజనలు, భక్తి గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం శాంతి మంత్ర పఠనం జరిగింది. పూజా సామాగ్రితో పాటు ప్రసాదాలను అందించేందుకు దాతలు ముందుకు వచ్చారు. కార్యక్రమం విజయవంతం కావడంతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతు మన దేశంలో నదులకు ఎంతో ప్రాముఖ్య ఉందని, అలాంటి నదులు గొప్పతనాన్ని ప్రజలకు తెలిపే విధంగా నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందన్నారు. దీనిపై మంరిత ప్రచారాన్ని నిర్వహించి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యేలా అంతా కృషి చేయాలని కోరారు. పురోహితులు రామావజుల రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతీ ఒక్కరికీ ప్రత్యేక ప్రసాదాల పంపిణీ జరిగింది. గ్రామ పంచాయితీ ఇఓ శ్రీనివాస్, దేవస్థానం డిఇ రవీందర్, పురోహితులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

## సిపిఐ అభ్యర్ధికి టిఆర్ఎస్, సిపిఎం మద్దతు



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీలోని దిద్దిపూడి 15వ వార్డులో మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థి నల్లమోతు శైలజకి సిపిఎం, బిఆర్ఎస్ పార్టీలు ఆదివారం మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నల్లమోతు శైలజ భారీ మెజారిటీతో గెలిపించాలని సిపిఎం, బిఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

# సిట్ నోటీసులపై బిఆర్ఎస్ నిరసన



(మొదటిపేజీ తరువాయి)

చేపట్టారు. ఖమ్మం, వైరాలో ర్యాలీకి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ శాసన సభ్యురాలు బానోత్ చంద్రావతి, పాలేరులో శాసన మండలి సభ్యులు, తాతా మధుసూదన్, మాజీ ఎంఎల్‌ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి, కొత్తగూడెంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు నేతృత్వం వహించారు. మధిరలో లింగాల కమల్‌రాజు, సత్తుపల్లిలో సండ్ర వెంకటవీరయ్య తదితరులు నేతృత్వం వహించారు.

**ఖమ్మంలో ఉద్రిక్తత :**

బిఆర్ఎస్ ర్యాలీ, ఆందోళన సందర్భంగా ఖమ్మంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నేతృత్వంలో బిఆర్ఎస్ శ్రేణులు ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు మీదుగా రాపర్తి నగర్ సెంటర్, బస్‌డిపో, మయూరిసెంటర్, జెడ్పి సెంటర్ మీదుగా ఇల్లెందు క్రాస్ రోడ్డు వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఇల్లందు క్రాస్ రోడ్డులో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను తగలబెడుతున్న క్రమంలో పోలీసులకు, బిఆర్ఎస్ శ్రేణులకు తోపులాట చోటు చేసుకుంది. తోపులాటలో వన్‌టౌన్ సిఐ కరుణాకర్ కిందపడడంతో అతని చేతికి గాయమైంది. ఆయనను ఆసుపత్రికి తరలించారు. ఈ తోపులాటకు సంబంధించి బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు తో పాటు ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పగడాల నాగరాజు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**తప్పుడు కేసులతో బిఆర్ఎస్‌ను అడ్డుకోలేరు : మాజీ మంత్రి పువ్వాడ**

తప్పుడు కేసులతో బిఆర్ఎస్‌ను అడ్డుకోలేరని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్‌ను విచారణకు పిలవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన తెలిపారు. ఆందోళనను ఉద్దేశించి అజయ్‌కుమార్ మాట్లాడుతూ చట్ట ప్రకారం 65 ఏళ్లు నిండిన వ్యక్తిని విచారించాలంటే ఆ వ్యక్తి ఉన్న చోటనే విచారణ చేపట్టాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అలా కాకుండా విచారణ పేరుతో నోటీసులు జారీ చేసి కేసిఆర్‌ను చిన్నబుచ్చాలని చూస్తుందని అజయ్‌కుమార్ ఆరోపించారు. విచారణకు సహకరిస్తానని చెప్పినా సిట్ అధికారులు ఈవిధంగా వ్యవహరించడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది పోలీస్ అధికారులకు మాత్రమే సంబంధించిందని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి పసలేని కేసులు కేసిఆర్‌కు కొత్త కాదని కానీ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తిని తప్పుడు కేసులతో వేధించడం తగదని ఆయన సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమాలు, త్యాగాలతో సాధించిన తెలంగాణను అభివృద్ధి పథంలో నడింపించాలని కేసిఆర్ ప్రయత్నించారని అందుకు ప్రతీకారమే ఈ కేసులని అజయ్‌కుమార్ తెలిపారు. అక్రమ కేసులకు భయపడకుండా మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని అజయ్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, నాగండ్ల కోటేశ్వరరావు, కూరాకుల వలరాజు, జ్యోతిరెడ్డి, బుడిగం శ్రీను, పసుమర్తి రాంమోహన్, బుర్రి వెంకట్, నాయకులు తోట రామారావు, బిక్కసాని జశ్వంత్, మాటేటి నాగేశ్వరరావు, రాజేష్, బీరెడ్డి నాగ చంద్రారెడ్డి, తాజుద్దీన్, లీగల్‌సెల్ నాయకులు తిరుమలరావు, సుగుణారావు, కొత్తా వెంకటేశ్వర్లు, షకీనా, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అభ్యర్థి మాదినేని సునీత ప్రచారం



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలో సిపిఎం పార్టీ బలపరిచిన 12వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి మాదినేని సునీత ఆ వార్డు బిఆర్ఎస్, సిపిఎం నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసిన మాదినేని సునీత కారు గుర్తుకు ఓటు వేసి అండగా ఉండాలని కోరారు. అదేవిధంగా ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటానని మీ తోబుట్టువులు ఆదరించి గెలిపంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, సిపిఎం నాయకులు సుగ్గల మాధవి, కట్టా నాగేశ్వరరావు, మాడపాటి వెంకటి, మిట్టపల్లి కిరణ్, కొల్లా రాంబాబు, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, మాదినేని దుర్గాప్రసాద్, రంగా సత్యనారాయణ, మాదినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సురేఖను కలిసిన సర్పంచ్ అశ్విని



**ప్రజాపక్షం/వైరాః** తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను వైరాలో ఎన్‌విఎస్ గార్డెన్ నందు తాటిపూడి గ్రామ సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రేస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, జవ్వాజి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కూరపాటి ఆసుపత్రి ప్రారంభం





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కూరపాటి చిల్డ్రన్స్, మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆదివారం నూతన ఆసుపత్రిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరంలో అత్యాధునీక సౌకర్యాలతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను తక్కువ ఖర్చుతో అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు, ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ చిల్డ్రన్స్ విభాగంతో పాటు మల్టీస్పెషాలిటీ విభాగంలో అనుభవజ్ఞులైన వైద్యులతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.తక్కువ ఖర్చుతో ఆధునాతన వైద్యాన్ని ప్రజలకు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ కమర్తపు మురళి, ఐఎంఎ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎం. కోటేశ్వరరావు, ఐఎంఎ కోశాధికారి డాక్టర్ కూరపాటి ప్రీతి, టివిస్ఎంసి మెంబర్ కె. రవికుమార్, టిడిపి ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ కూరపాటి వెంకటేశ్వర్లు, పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో బిఆర్ఎస్ శ్రేణులు నిరసన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేసినందుకు నిరసనగా బిఆర్ఎస్ శ్రేణులు గ్రామాల్లో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. మండల వ్యాప్తంగా ఆదివారం అన్ని గ్రామాల్లో బిఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బిఆర్ఎస్ నేతలపై కక్ష సాధింపు ధోరణిని అవలంభిస్తుందని నాయకులు తెలిపారు. తెలంగాణ సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసిఆర్‌ను ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు పిలవడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వీరునాయక్, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షులు మాధంశెట్టి హన్మంతరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మద్దినేని వెంకటరమణ, ఆత్మ మాజీ ఛైర్మన్ భూక్యా లక్ష్మ ణ్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ పిన్ని కోటేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు నున్నా శ్రీనివాసరావు, పొట్లపల్లి నాగరాజు, తోట వెంకటేశ్వర్లు, చెరుకూరి భిక్షమయ్య, తొలపనూరి దానయ్య, కుతుంబాక నరేష్, ఖీమా, తేజావత్ రామోజీ తదితరులు పాల్గొన్నారు.

# నిర్విరామంగా బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ వైద్య క్యాంపులు

**-65వ బిపి, షుగర్ ప్రత్యేక క్యాంపు విజయవంతం**
**-ప్రముఖ జనరల్, బిపి, షుగర్ వైద్యులు టి పవన్‌కుమార్**



**ప్రజాపక్షం/బోనకల్:** నిర్విరామంగా బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ వైద్య క్యాంపుల సేవలు మండల ప్రజలకు అందుతున్నాయని ప్రముఖ జనరల్, బిపి, షుగర్ వైద్యు లు టి పవన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక ప్రాంగణంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం ప్రతి నెలమొదటి ఆదివారం నిర్వహించే బిపి, షుగర్ 65వ క్యాంపు విజయవంతమైంది. ఈ సందర్భంగా వైద్యులు టి పవన్‌కుమార్ మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహంలను అదుపులో ఉంచుకోవడం ఆరోగ్యకరమైన జీవితానికి చాలా కీలకమని అన్నారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే గుండె, మూత్రపిండాలు, కళ్లు మరియు నరాలపై తీవ్ర పడుతుందని అన్నారు. క్రమబద్ధమైన తనిఖీలు, సరైన మందులు, ఆరోగ్యకరమైన ఆహారం, శారీరక వ్యాయామం ద్వారా ఈ వ్యాధులను అప్రమత్తంగా నియంత్రివచ్చని తెలిపారు. రక్తపోటు, బ్లడ్ షుగర్ స్థాయిలను తరుచుగా పరీక్షించుకొని రికార్డులను నిర్వహించాలని అన్నారు. ఉప్పు వాడకాన్ని తగ్గించాలని, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి రోజు కనీసం 30 నిమిషాల వేగవంతమైన నడక లేదా వ్యాయామం చేయాలని అన్నారు. షుగర్ లేదా బిపి సాధారణంగా ఉన్నా, వైద్యులు సూచించిన మందులు ఆపకుండా వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆర్ఎంపిడబ్ల్యుఏ టిఏస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, క్యాంపు సహాయకులు యంగల గిరి, బొమ్మ సతీష్‌కుమార్, గోపి, సిపిఎం నాయకులు షేక్ నజీరు, టిడిపి నాయకులు దుగ్గి భద్రయ్య పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న కాంగ్రెస్

**అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ శ్రేణుల వినతి**



**ప్రజాపక్షం/చింతకాని :** బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టడంతో పాటు జలదోపిడీపై బీఆర్ఎస్ పోరాటం చేస్తున్న నేపథ్యంలో మాజీ సీఎం కేసిఆర్‌పై రాష్ట్ర సర్కార్ కక్షసాధింపు చర్యలకు దిగిందని బారాస చింతకాని మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్‌పై రేవంత్ సర్కార్ అక్రమంగా పెడుతున్న కేసులను నిరసిస్తూ చింతకాని మండల బారాస శ్రేణులు చింతకాని తహసీల్దార్ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ సమీపంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకూ నల్లబ్యాడ్జీలు ధరించి కాంగ్రెస్ పాలన మాకొద్దు అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకగా నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టి అంబేద్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షను తుంగలో తొక్కి ప్రశ్నించిన వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెడుతూ అరాచక పాలన సాగిస్తున్నారని రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేసిఆర్‌తో పోటీ పడాలి కానీ, ఈ విధంగా విధ్వంసం చేయడమేంటని ప్రశ్నించారు. సీఎం ఎన్ని కుట్రలు చేసినప్పటికీ బిఆర్ఎస్ ను బలహీనపర్చలేరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ గురిజాల హనుమంతరావు, జిల్లా నాయకులు మంకెన రమేష్ , యువజన విభాగం అధ్యక్షుడు పిన్నెల్లి శ్రీను, నాయకులు వంకాయలపాటి వెంకట లచ్చయ్య, వంకాయలపాటి సత్యనారాయణ, గడ్డం శ్రీను, తిరుపతి కొండలరావు, కన్నెబోయిన కుటుంబరావు, వేముల నర్సయ్య, మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్ , దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, నన్నక నర్సింహారావు, సామినేని అప్పారావు, లచ్చగూడెం ఉప సర్పంచ్ పోట్ల సీతయ్య , బండి రామారావు, జావీద్, చిట్టిమోదు రాంబాబు, తిరుమలాపురం, కోమట్లగూడెం సర్పంచ్‌లు చాపలమడుగు వీరబాబు, పరిశుద్ధరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలోని 28వ డివిజన్‌లో గల రైజింగ్ కిడ్స్ ప్రైమరీ స్కూల్ ఆధ్వర్యంలో ఉచితి వైద్య శిబిరంను ఆదివారం నిర్వహించారు. ఇందులో పాల్గొన విద్యార్థులు, తలిదండ్రులు, ప్రజలకు చికిత్స నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పలువురు వైద్య సలహాలను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రదీప్, ఉపాధ్యాయ బృందంతో పాటు 3నుండి6వ తరగతి చదివే పిల్లలు వాలంటీర్లుగా చక్కని సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంను దూషించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం



**ప్రజాపక్షం/చింతకాని :** ఏపీ ముఖ్యమంత్రి తేదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా నేత అంబటి రాంబాబు ను తక్షణమే అరెస్ట్ చేయాలని తేదేపా చింతకాని మండల అధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం చింతకాని మండల తేదేపా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముయమంత్రిని దూషించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు చంద్రబాబు కృషి చేస్తుంటే వైకాపా నేతలు అడ్డూ అదుపూ లేకుండా దూషణలు చేయడం సిగ్గు చేటన్నారు. అంబటిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు నన్నక రామారావు, సీనియర్ నాయకులు నన్నక గోపాలరావు, కోశాధికారి మల్లెల సత్యనారాయణ, నాయకులు బండి ప్రసాద్, కూచిపుడి సతీష్, షేక్ జానీమయా తదితరులు పాల్గొన్నారు.

# రెండు అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**ప్రజాపక్షం/చింతకాని :** అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌ను చింతకాని గ్రామంలో ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎటువంటి ధృవీకరణ పత్రాలు లేకుండా చిన్నమండవ మున్నేరు నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/చింతకాని :** మున్నేటి నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని చింతకాని తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండవ ర్యాంపు వద్ద ఇసుక రవాణా చేయకుండా జేసీబీతో రెవెన్యూ సిబ్బంది గాడి తీయించారు. చిన్నమండవ, తిమ్మినేనిపాలెం మున్నేరు పరివాహక ప్రాంతం నుండి ఇసుక రవాణా నిలిపివేయడమైనదని, ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాక్టర్లను సీజ్ చేసి సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# కెసిఆర్‌పై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి



**ప్రజాపక్షం/ మధిర టౌన్ :** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ మీద కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే సిట్ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నారని మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల కన్వీనర్ చావా వేణు పేర్కొన్నారు. కేసిఆర్‌కి సిట్ నోటీసులు ఇవ్వడం పట్ల ఆదివారం మధిర మండలం సిరిపురం గ్రామంలో ప్రధాన రహదారిపై పార్టీ శ్రేణులతో కలిసి వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న వేళ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను దారిమళ్లించేందుకు కేసిఆర్‌కి సిట్ నోటీసులు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ప్రశ్నిస్తుంటే అవి అమలు చేయలేక బిఆర్ఎస్ పార్టీపై అలానే పార్టీ నాయకులపై ఎదురుదాడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నంబూరు శ్రీనివాసరావు, కటికల సత్యనారాయణెడ్డి, బొగ్గుల వీరారెడ్డి, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇష్ట శేషగిరి, కనకపూడి నర్సింహారావు, కనకపూడి పుల్లారావు, రామాల రాజశేఖర్, షేక్.సలీం షేక్.పరుక్‌పాషా, ధరావత్ వేణు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కళ్యాణం



ప్రజాపక్షం/కారేపల్లి: మండల పరిధిలోని భీక్యతండా గ్రామంలో కొలువుదీరిన శ్రీ గోప్య సమేత శ్రీ లక్ష్మి తిరుపతమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. అదే విధంగా మాల ధరించిన స్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ శాసన సభ్యులు లావుడియా రాములు నాయక్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి మాజీ శాసన సభ్యులు లావుడియా రాములు నాయక్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడవాలని పేర్కొన్నారు. అనంతరం ఆలయ ధర్మకర్త అజ్మీర కృష్ణ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈకార్యక్రమంలో సర్పంచులు గుగులోత్ కృష్ణవేణి వీరునాయక్, దండు ప్రవీణ్, ఉపసర్పంచులు లాలు, నాయకులు అజ్మీర వీరన్న, వాంకుడోత్ విజయ్, జరుపల ప్రసాద్, గుగులోత్ హారు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యం

**బిఆర్ఎస్ చైర్‌పర్సన్ అభ్యర్థి కట్టా స్వరూపరాణి**



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, సిపిఎం పార్టీ బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి కట్టా స్వరూపరాణి వార్డు సమస్యల పరిష్కారమే లక్ష్యగా ముందుకు సాగుతానని అన్నారు. ఆదివారం కట్టా స్వరూపరాణి మాట్లాడుతూ మున్సిపాల్ ఎన్నికల్లో సిపిఎం పార్టీ మద్దతుతో బిఆర్ఎస్ పార్టీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా పోటీలో నిలబడ్డానని, నాతోపాటు 20 వార్డుల్లో పోటీచేస్తున్న టిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలే పరిష్కారానికి నిరంతరం పాటుపడతానని చెప్పారు. ప్రతి వార్డును అభివృద్ధిలో ఉంచేందుకు కృషి చేస్తానని వివరించారు. పేదల సంక్షేమం కొరకు కెసిఆర్ ఎంతో కృషి చేశారని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ మౌళిక వసతులు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించారు.

## మండల వ్యాప్తంగా బిఆర్ఎస్ నిరసన



ప్రజాపక్షం/అశ్వాపురం: సిట్ విచారణ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులపై మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోడి అమరేందర్ యాదవ్ 24 గ్రామ పంచాయితీలో పిలుపు మేరకు అశ్వాపురం మండలంలో అశ్వాపురం, మల్లెలమడుగు, ఆనందపురం గ్రామ పంచాయితీలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, ఈదరా సత్యనారాయణ, కందుల కృష్ణార్జునరావు, సూదిరెడ్డి గోపి రెడ్డి, నక్కనబోయిన పాపారావు, చిలక వెంకటరామయ్య, భూక్య చందులాల్, ఏనుగుల సత్యనారాయణ, ఆనందపురం సర్పంచ్ మురం సమయ్య, ఉప సర్పంచ్ దేవనబోయిన మహేష్, మల్లెలమడుగు ఉప సర్పంచ్ గాడిద మహేష్, మాజీ ఉప సర్పంచ్ చావ రాఘవులు, వార్డు సభ్యులు కదారీ వేణు, కడమంచి మహేష్, యూత్ ప్రధాన కార్యదర్శి మంగళగిరి రామకృష్ణ, సోషల్ మీడియా మందా హుస్సేన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## పన్ను బకాయిలు చెల్లించాలని వినతి



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం పంచాయితీకి గౌతమినగర్ కాలనీ చెల్లించాల్సిన పన్ను బకాయిలను గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందని అట్టి బకాయిలను చెల్లించాలని అశ్వాపురం విచ్చేసిన డిఏఈ సెక్రటరీ, ఏఈసి ఛైర్మన్ అజిత్ కుమార్ మొహంతికి అశ్వాపురం సర్పంచ్, ఉప సర్పంచ్ బానోత్ సదర్ లాల్, తుళ్లూరి ప్రకాష్‌లు వినతి పత్రం అందజేశారు. 2021వ సంవత్సరం నుండి 2026 వ సంవత్సరం వరకు బకాయిలు ఉన్నారని, సుమారు 27లక్షల523రూపాయలు చెల్లించాలని ఆ వినతిలో పేర్కొన్నారు.

## అజిత్ కుమార్ మొహంతికి సన్మానం



ప్రజాపక్షం/అశ్వాపురం : భారజల కర్మాగారంలో ఆక్సిజన్ 18 నూతన ప్లాంట్ శంకుస్థాపనకు విచ్చేసిన అణుశక్తి కమీషన్ ఛైర్మన్ అండ్ సెక్రటరీ టూ డిపార్ట్మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ డాక్టర్ అజిత్ కుమార్ మొహంతిని శనివారం శివ కామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు గౌతమినగర్ కాలనీ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెవీ వాటర్ ప్లాంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కూరపాటి శ్రీనివాసరావు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలి

**- ప్రభుత్వ పథకాలే అస్త్రాలుగా ప్రజల్లోకి వెళ్లండి**
**-ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి కొండా సురేఖ**






ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : మున్సిపల్ ఎన్నికల సమరంలో కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా కదలాలని, సంక్షేమ పథకాలను ఆయుధాలుగా చేసుకొని ప్రతి ఇంటి గడపగడపను తట్టాలని రాష్ట్ర దేవాదాయ, ఆటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మద్దినేని బేబి స్వర్ణ కుమారి అధ్యక్షతన జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మున్సిపల్ ఎన్నికల క్షేత్రంలో పార్టీ జెండా రెపరెపలాడడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

**ఐక్యమత్యమే మహాబలం**

అధికారంలో ఉన్నప్పుడు పదవుల కోసం పోటీ ఉండటం సహజమాని, అయితే పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఐక్యంగా ముందుకు సాగాలని మంత్రి సూచించారు. మున్సిపాలిటీలోని 32వార్డులకు గాను కాంగ్రెస్ నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బరిలో నిలవడంపై ఆమె స్పందిస్తూ, మనలో మనమే కొట్లాడుకుంటే మూడో వ్యక్తి గెలిచే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. నేతలు చొరవ తీసుకొని అభ్యర్థులందరినీ ఏకతాటిపైకి తేవడం అభినందనీయమని పేర్కొన్నారు. వార్డుకు ఒక్కరే అభ్యర్థి ఉండేలా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు.

**ప్రజాక్షేత్రంలో సంక్షేమ విజయాలు**

మున్సిపాలిటీలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులతో రూపొందించిన కరపత్రాన్ని మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. 200యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పెంపు వంటి పథకాలు ప్రతి కుటుంబానికి కొండంత భరోసా ఇచ్చాయని ఆమె గుర్తుం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సారథ్యంలో పాలేరునియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ఇదే ఊపుతో మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకొని ఆయనకు కానుకగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**ప్రచార హోరుకు సర్వసిద్ధం**

సోమవారం ఉదయం నాటికి అభ్యర్థులందరికీ బిఫామ్‌లు అందజేస్తామని, అప్పటి నుంచే ముమ్మర ప్రచారం మొదలుపెట్టాలని మంత్రి సూచించారు. వార్డుల్లో ఘన విజయం సాధిస్తేనే మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కుతుందని, ఐక్యతతోనే అది సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలి



ప్రజాపక్షం/ మధిర : పార్టీ సిద్ధాంతాలకు ప్రతిఒక్కరూ కట్టుబడి పనిచేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి, మున్సిపల్ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి కొండా సురేఖ అన్నారు. మధిర మున్సిపాల్టీలో 22 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆదివారం స్థానిక రెడ్డి గార్డెన్స్‌లో జరిగిన మున్సిపల్ ఎన్నికలపై అభ్యర్థులు, వార్డుల ఇన్‌చార్జిలతో జరిగిన సన్నాహాక సమావేశంలో ఆమె ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు.. కష్ట కాలం నుండి కాంగ్రెస్ పార్టీ కోసం అన్నిరకాలుగా కష్టపడ్డ వారికి కాంగ్రెస్‌పార్టీ టికెట్ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. పైస్థాయి నుండి కిందిస్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ ఉంటేనే పనులు జరుగుతాయని అన్నారు. ప్రతి వార్డుకి ఐదుగురు చొప్పున కాంగ్రెస్ పార్టీ తరుపున నామినేషన్లు వేయడం జరిగిందని, వార్డుల్లో గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థికే కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలో గెలిచే అభ్యర్థులు మాత్రం అధికారంలో ఐదు సంవత్సరాలు ఉంటారని పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపొందిన వారు కీలకపాత్ర పోషించే అవకాశం ఉందని అన్నారు. అందుకే ప్రతిఒక్క వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కూడా కలిసిమెలిసి పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపులకు తావులేకుండా పార్టీ సిద్ధాంతాలకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్ని వార్డులో కాంగ్రెస్ పార్టీని గెలపించుకుని చైర్మన్ పదవి దక్కించుకునే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. 22 వార్డుల్లో గెలిపించి ఇన్‌చార్జిగా వచ్చిన నాకు బహుమతిగా ఇస్తారని ఆశిస్తున్నానని అన్నారు. మధిర మున్సిపాలిటీలో 22వార్డుల్లో కాంగ్రెస్‌ను గెలిపించి డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకు బహుమానంగా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పోటీచేసే అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ నేత కెసిఆర్‌ను సిట్ విచారణ చేయడం కక్ష సాధింపే..


**-బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి**
**కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశత్వాన్ని నిరసిస్తూ ధర్నా**



ప్రజాపక్షం/బూర్గంపాడు: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారణ పేరుతో వేధింపులకు గురి చేయడం కక్ష సాధింపు చర్యేనని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరికించేందుకు సిట్ అధికారులు విచారణ చేయడం సరైన పద్ధతి కాదని, ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేస్తూ మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. . ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు కేసీఆర్‌పై విచారణ చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు రూ 2500 రూపాయల గౌరవ వేతనం, రైతులకు రైతుభరోసా, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్‌తో ఉద్యోగాల నోటిఫికేషన్లు, బాలికలకు స్కూటీలు, నవ వధువులకు కళ్యాణ లక్ష్మీ , షాదీ ముబారక్ కింద తులం బంగారం వంటి అనేక ముఖ్యమైన పథకాలు అమలు మరచిపోయి, అదే విధంగా రైతులకు యూరియా సరఫరా చేయడంలో విఫలమైనందని, రైతులను మభ్యపెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలను తప్పుదోవ పట్టించాలనే దురుద్దేశంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అంటూ అధినాయకత్వంపై సిట్ విచారణ పేరుతో కక్ష సాధింపులకు పాల్పడుతున్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఎండగడుతూ నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు పొడియం నరేంద్ర, కెవి రమణ, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, వలదాసు సాలయ్య, తోకల శ్రీను, పాటి అశోక్, వార్డు సభ్యులు ఖాదర్, టిప్పు సుల్తాన్, ఆటో యూనియన్ అధ్యక్షులు సారపాక భూక్య కృష్ణ, సుదర్శన్, సుబ్బారావు, చిట్టా సతీష్, శ్రీను, విజయ్, రాము, కుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ అభ్యర్థులను గెలిపించండి

**- పాల్వంచ అభివృద్ధికి సహకరించాలి**
**- పాల్వంచకు ఎన్నికలు తెచ్చిన ఘనత కూనంనేనిదే..**







ప్రజాపక్షం/పాల్వంచ : కొత్తగూడెం కార్పోరేషన్ పరిధి పాల్వంచ డివిజన్‌లో సిపిఐ అభ్యర్థులు జోరుగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. కంకి కొడవలి గుర్తుకు ఓటెయ్యాలని ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్న వారిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. పట్టణం మరింత అభివృద్ధి కావాలంటే ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావుకు మద్దతునివ్వాలంటూ కోరుతున్నారు. సుమారు 30 సంవత్సరాలుగా పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు లేకపోవటంతో పట్టణం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకొంటూ పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్‌లోని కొన్ని గ్రామాలను కలిపి కొత్తగూడెం కార్పోరేషన్‌గా ఏర్పాటు చేసి పాల్వంచకు ఎన్నికలు తీసుకొచ్చిన ఘనత కేవలం ఎంఎల్ఏ కూనంనేనిదే అన్నారు. దీనితో పాల్వంచ అన్ని రంగాలలో మరింత అభివృద్ధి జరిగేందుకు పాటు పడిన కూనంనేని నాయకత్వాన్ని బలపరిచి సిపిఐ అభ్యర్థుల కంకీకొడవలి గుర్తుపై ఓటేయాలని కోరారు.

**- సమస్యలను పరిష్కరిస్తాం :**

ఓటేసి గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామని, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామంటూ సిపిఐ బలపరిచిన 35వ, డివిజన్ అభ్యర్థి నామా కీర్తి, 38వ, డివిజన్ చెరుకూరి శేఖర్, 44వ, డివిజన్ అభ్యర్థి వీసంశెట్టి విశ్వేశ్వరరావులు అన్నారు. ఆయా డివిజన్‌లలో ఆదివారం కార్యకర్తలు, అభిమానులతో కలిసి విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ కంకీ కొడవలి గుర్తుపై ఓటేయాలంటూ కోరారు. ఈ సందర్భంగా పాల్వంచ అభివృద్ధికి కూనంనేని చేస్తున్న కృషిని తెలిపారు. వివిధ గ్రాంట్ల నుండి కోట్ల నిధులను తెచ్చి చేపట్టిన అభివృద్ధి పనులను చేపట్టారని అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకొంటూ డివిజన్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పాటుపడతామని హామీ ఇచ్చారు. ప్రత్యేక ప్రణాళికను తయారుచేసి ప్రజల భాగస్వామ్యంతో ప్రాధాన్యతా క్రమంలో పనులను చేస్తామన్నారు. లంచాలకు తావులేని పాలన కొనసాగిస్తామని, అవినీతికి ఆస్కారం లేని అభివృద్ధి పనులను పూర్తి చేసి పదికాలాల పాటుగా ప్రజలు గుర్తుంచుకొనే విధంగా డివిజన్‌లను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతామని స్పష్టం చేశారు.

**- సిపిఐ అభ్యర్థులను గెలిపించండి :**

వందేండ్ల చరిత్ర కలిగిన సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి, అభివృద్ధి పట్టం కట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరారు. పాల్వంచ డివిజన్‌లోని పలు డివిజన్‌లలో సిపిఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తీ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వందల కోట్ల నిధులను తెచ్చి పాల్వంచ అభివృద్ధికి ఎంఎల్ఏకూనంనేని సాంబశివరావు పాటు పడుతున్నారని చెప్పారు. పాల్వంచ పట్టణ అభివృద్ధికి ఎంఎల్ఏ కూనంనేని ఓ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారని అన్నారు. సమర్థవంతమైన ఎంఎల్ఏ కూనంనేని సారధ్యంలో పాల్వంచను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవటానికి కంకీ కొడవలి గుర్తుపై ఓటేసి సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యాక్రమంలో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌కు సిట్ విచారణపై బిఆర్ఎస్ నిరసన



ప్రజాపక్షం/జూలూరుపాడు: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు పేరుతో సిట్ నోటీసులు ఇవ్వటం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు జూలూరుపాడు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు యల్లంకి సత్యనారాయణ మాట్లాడుతూ కోట్లాది మంది ఆకాంక్షల్ని నెరవేర్చిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు విచారణ పేరుతో నోటీసులు ఇవ్వడం రేవంత్ రెడ్డి రాజకీయ కక్ష సాదింపు చర్యనని అన్నారు. పదేండ్ల పాలనలో కేవలం సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ఇజం నగర్ పనిచేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అలాంటి నాయకుడు కేసీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం నిందలు మోపడం తగదన్నారు. పరిపాలనా చేతకాక రేవంత్ రెడ్డి చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ లో భాగమే ఈ సిట్ విచారణని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,420 హామీలు నెరవేర్చాలన్నారు. లేదంటే రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చాపలమడుగు రామ్మూర్తి, గుండెపూడి ఉప సర్పంచ్ బాదావత్ నరేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు యదలపల్లి వీరభద్రం, దుద్దుకూరి కృష్ణ ప్రసాద్, తాళ్లూరిరామారావు, గుమ్మడి వెంకటేశ్వర్లు, పదిమళ్ళ రాంబాబు, బోడా భోజ్య, పురస్తపురవు రామకృష్ణ, పోతురాజు, రామారావు, బుడిపూడి ప్రభాకర్, మోదుగు నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కెసిఆర్‌పై సిట్ విచారణ కక్ష సాధింపు చర్యే..



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండలం తాటిగూడెం గ్రామపంచాయతీలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని బిఆర్ఎస్ కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన చేతకాక ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజలను మభ్యపెట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కాలం గడుపుతుంది అన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చాక రైతుల పించన్లు పెంచలేదు ,కళ్యాణ లక్ష్మి ఎగ్గొట్టారు, తెలంగాణలో 18 సంవత్సరాలు నిండినటువంటి మహిళలందరికీ 2500 చొప్పున ఇస్తానన్న హామీని కూడా నెరవేర్చలేకపోయారు అన్నారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది అటువంటిది తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా రైతులకు యూరియాను సకాలంలో సరఫరా చేయడంలో తీవ్రంగా విఫలమైంది అన్నారు. రైతు వేసినటువంటి వరి పంటకు సకాలంలో ఎరువులు వేయకపోతే రైతు పంట దిగుబడిని తీవ్రంగా నష్టపోతున్నారు అన్నారు. ఈ సందర్భంగా తాటి గూడెం గ్రామపంచాయతీలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దుర్గం సంజీవ, మాజీ సర్పంచ్ కొమరం విశ్వనాథం, ఉప సర్పంచ్ నాగరాజ్, జిమ్మిడి ప్రశాంత్, జాడి రాజు, దుర్గం నాగభూషణం, సత్యం జాడి రాజు, జాడి రవికుమార్, నాగేశ్వరరావు, సాంబక్క, సరిత తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు చేయూత ట్రస్ట్ అండ



ప్రజాపక్షం/బూర్గంపాడు: నిరుపేద కుటుంబాలకు చేయూత ట్రస్ట్ అండగా నిలబడుతుందని ట్రస్ట్ గౌరవాధ్యక్షులు కె వెంకటేశ్వర్లు(కేవీ)అన్నారు. మండల పరిధిలోని మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన పుట్టి నరసింహారావుకు ఆదివారం బంజరు గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ వారు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పుట్టి నరసింహారావు జీవనోపాధి కోసం తాపీ పని నిమిత్తం హైదరాబాద్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గత వారం రోజుల క్రితం అనుకోకుండా ప్రమాదం జరగడంతో ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయాయి. కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని భద్రాచలం ప్రైవేట్ ఆసుపత్రిలోని ఆరోగ్య శ్రీ కింద అడ్మిషన్ చేయించి వైద్యం అందిస్తున్నారు. నిరుపేద కుటుంబ కావడంతో పూట గడవడానికి ఇబ్బంది పడుతున్న వేళ కనీసం ఖర్చులకు కూడా డబ్బులు లేకపోవడంతో చేయూత ట్రస్టు వారిని సహాయం అడగటంతో వెంటనే స్పందించిన చేయూత ట్రస్టు ఆదివారం మూడు వేల రూపాయలను భద్రాచలం ప్రైవేట ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రుడికి అందజేశారు. ఈసందర్భంగా కేవీ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి చేయూత ట్రస్టు ఎన్నో నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం కాకుండా విద్య, వైద్య రంగాలలో ప్రధానంగా నిరుపేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తూ సేవలందిస్తుందని తెలిపారు. చదువుకోవటానికి ఒక గ్రంథాలయాన్ని మోరంపల్లిబంజర్ బస్టాండ్ ప్రాంతంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి జక్కిరెడ్డి మల్లారెడ్డి, కోశాధికారి పుట్టి రాకేష్, ట్రస్ట్ కుటుంబ సభ్యులు శనగ మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం



ప్రజాపక్షం/పాల్వంచ : కేంద్ర ప్రభుత్వం ఆదివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి తీరని అన్యాయం చేస్తూ కేవలం 2.6 శాతం నిధులను కేటాయించారని పిడిఎస్‌యు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు జి. వీరభద్రం విమర్శించారు. ఈ బడ్జెట్ కేటాయింపులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటంలో, విద్యా సంస్థలలో లింగ, సామాజిక అంతరాలు మరింత పెరిగిపోయే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని పాలక బిజేపి ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేది ఒకటని, దేశ ప్రజలను మభ్యపెట్టి అబద్దాలను నిజాలుగా చేస్తూ పాలన చేస్తున్నారని ఆరోపించారు. బహుళజాతి కంపెనీల అవసరాలకు ఉపయోగపడే వనరులను సృష్టించేందుకు విద్యలో ఏఐ ఇంటిగ్రేషన్, డిజిటల్ ఇన్‌ఫ్రా, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, వృత్తి నైపుణ్యాల కోర్సుల పేరుతో నూతన ప్రణాళికలు పరిచయం చేస్తూ వాటికే అధిక నిధులను కేటాయించారని మండిపడ్డారు. ప్రస్తు అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేరన్నారు. టీచర్లకు శిక్షణ ఇచ్చేందుకు, యూనివర్సిటీలలో పరిశోధనలకు నిధులు సరిపో వటం లేదన్నారు. దీనితో మౌళిక వసతులు లేక కేంద్ర యూనివర్సిటీలు కునారిల్లు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగంపై వివక్ష చూపకుండా అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## అంతర్గత ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/పాల్వంచ: పనిచేసే ప్రదేశంలోమహిళలపై లైంగిక వేధింపులను అరికట్టడానికి అంర్గత ఫిర్యాదు కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలతా లెనీనా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని మొత్తం కార్యాలయాలు, సంస్థలు, ప్రభుత్వ, ప్రవేటు రంగాలకు చెందిన సంస్థలలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 చట్టం ప్రకారం అంతర్గత ఫిర్యాదు కమిటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వాటి వివరాలను షిబాక్స్ పోర్టల్‌వెబ్ సైట్:http;//shebox.web.gov.in లో నమోదు చేయాలన్నారు. ఐసిసి ఏర్పాటు చేయని, లేదా వివరాలు పోర్టల్ నమోదు చేయాలని సూచించారు. లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతర్గత ఫిర్యాదు కమిటీ వివరాలను జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని అన్నారు.

## ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ రాష్ట్ర కార్యదర్శిగా రామడుగు మనోహర్ రావు



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : మండల పరిధిలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన రామడుగు మనోహర్ సుదీర్ఘ కాలం పాటు ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ డిస్ట్రిబ్యూటర్ గా ప్రభుత్వం ఆమోదం పొందిన మేలైన పురుగుమందులను విత్తనాలను అందించి అధిక దిగుబడి సాధించేందుకు కృషి చేసిన మనోహర్ సేవలను గుర్తించి ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. గతంలో మనోహర్ ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా పని చేశారు. ఆదివారం హైదరాబాద్ నగరంలో ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుమలాయపాలెం మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన రాముడు మనోహర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో తిరుమలాయపాలెం మండలం పెటిలైజర్స్ పెస్టిసైడ్స్ మండల అధ్యక్షత కార్యదర్శులు చల్లా వెంకటేశ్వర్లు, పానుగంటి హనుమారెడ్డి, వీరేశం, ఎస్‌కే మీరా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పనిచేయాలి



**మంత్రి కొండా సురేఖ**

**ప్రజాపక్షం/వైరా:** వైరాలో మున్సిపాలిటీ ఎన్నికల నేపధ్యంలోకాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎన్‌విఎస్ గార్డెన్ నందు జిలాలపార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా మున్సిపాల్ ఎన్నికల ఇంచార్జి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వైరా మున్సిపాలిటీ ఇంచార్జి రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ వైరా మున్సిపాలిటీ ముఖ్య నాయకులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా సమావేశానికి హాజరైన మంత్రి కొండా సురేఖకు జిల్లా పార్టీ అద్యక్షుడు నూతి సత్యనారాయణ వైరా మున్సిపాలిటీ ముఖ్య నాయకులు శాలువాతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో మున్సిపాల్ ఎన్నికల ఇంచార్జి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీలో ఉన్యన 20 వార్డుల్లో 190 నామినేషన్లు దాఖలు అయితే అందులో 92 నామినేషన్లు కాంగ్రెస్ పార్టీ నుండే పడటం విశేషం అని ఇక్కడ పార్టీ చాలా బలంగా ఉందని ఆమె అన్నారు. అలాగే పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఎప్పుడు ఉంటుంది. సీటు రాలేదని ఆవేదన ఆందోళన అవసరం లేదు, వారిని వారి సేవలు పార్టీ ఎల్లవేళలా ఉపయోగించుకుంటుంది అని ఆమె అన్నారు. వైరా మున్సిపాలిటీలో 20 వార్డుల్లో 20 వార్డులు గెలిచి తీరాలని గత గ్రామపంచాయతీ ఎన్నికల్లో జరిగిన తప్పిదాలు తిరిగి పునరావృతం కావద్దని ఆమె హెచ్చరించారు. పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులు చేయాలని ప్రతిఒక్క ఓటరును కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసే విధంగా చూడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ నెల11వ తేదీన జరుగుతున్న మున్సిపాల్ ఎన్నికల్లో వైరా మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా అందరూ కష్టపడి పనిచేసి చైర్మన్ స్థానాన్ని హస్తగతం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాలిటీ ఇంచార్జి రాష్ట్ర హస్తకళ సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, రాష్ట్ర మాజీ మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ జిల్లా పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ మున్సిపాల్ చైర్మన్ జైపాల్, వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, వైరా మండల పార్టీ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మున్సిపాలిటీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా మహోత్సవం పేరుతో అడ్మిషన్లు

**-అడ్డుకున్న వామపక్ష విద్యార్థి సంఘాలు**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఫేక్ కన్సల్టెన్సీలు, ఫేక్ యూనివర్సిటీలతో విద్యా మహోత్సవం పేరుతో ఖమ్మంలో చేపట్టిన అడ్మిషన్లను వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకున్నారు. ఆదివారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఇంజనీరింగ్, నీట్ అడ్మిషన్ల కోసం ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర రాష్ట్రాల ఫేక్ యూనివర్సిటీలు, ఫేక్ కన్సల్టెన్సీలతో నిర్వహించిన విద్యా మహోత్సవాన్ని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు అడ్డుకున్నారు. పోలీసులకు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, తుడుం ప్రవీణ్, చింతల రమేష్, గోకినేపల్లి మస్తాన్, అశోక్, సురేష్, లక్ష్మణ్ తదితరులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు జరగక ముందే అడ్మిషన్ల పేరుతో ఇతర రాష్ట్రాలకు చెందిన ఫేక్ యూనివర్సిటీలు, కన్సల్టెన్సీలు విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయన్నారు. అనుమతులు లేకుండా ఇలా అడ్మిషన్ల కోసం విద్యా మహోత్సవం అంటూ ఈవెంట్లు నిర్వహించడం శోచనీయమన్నారు. మాయ మాటలతో ఇతర రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, నీట్ అంటూ అడ్మిషన్లను విద్యార్థులను ఆకర్షిస్తూ ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఇటువంటి ఫేక్ యూనివర్సిటీలు, కన్సల్టెన్సీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, నాగులమీరా, పవన్, చైతన్య సాయి, గోపి, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు శ్రీనాథ్, లోకేష్, శ్రీశాంత్, గోపి, రమణ, పిడిఎస్‌యు నాయకులు శ్రీకాంత్, రాము, యశ్వంత్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్‌కు సిట్ నోటీసులు పంపడం రాజకీయ కక్ష సాధింపే..

**-వైరాలో బిఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ**
**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**





**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి ప్రజల గుండెల్లో నిలిచిన బిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ నియోజకవర్గ కేంద్రమైన వైరాలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయ సమీపం వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ శాసనసభ్యురాలు బానోతు చంద్రావతి, మంజుల మదన్‌లాల్, లకావత్ గిరిబాబు పాల్గొన్నారు. శాంతినగర్ వద్ద ర్యాలీ వైరాలోని తల్లాడ రోడ్డు, మధిర రోడ్డు వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో జై తెలంగాణ జై కెసిఆర్ నినాదాలతో మారుమ్రోగింది. అనంతరం తిరిగి వైరా రింగు రోడ్డు వరకు ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కెసిఆర్‌కు సిట్ నోటీసులు పంపడం హేయమైన చర్య, రాజకీయ కక్షతో చేసిన చర్యగా తీవ్రంగా ఖండించారు. ఎన్ని కుట్రలు పన్నినా కెసిఆర్‌ను ఏమి చేయలేరని, ప్రజలే త్వరలో బుద్ది చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దె లరవి, బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, దొంతబెబోయిన వెంకటేశ్వర్లు, కొత్తా వెంకటేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, మాదినేని దుర్గాప్రసాద్, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, నూకల వాసు, మాదినేని సునీత, మహిళా అధ్యక్షురాలు సక్కుబాయి, మేదరమెట్ల రాము, మిట్టపల్లి కిరణ్, అయినాల కనకరత్నం, బత్తుల లింగారావు, విలాసాగరం నరేష్, మడిపల్లి కృష్ణ, తిరుపతి శ్రీను, ఆదూరి ప్రేమ్‌కుమార్, వేల్పుల రవి, కారుకొండ బోస్, నూకల ప్రసాద్, గుజ్జర్లపూడి దేవరాజు, దొంతబోయిన వెంకటనారాయణ, వల్లెపు రాము, రంగా సత్యనారాయణ, మాదినేని లక్ష్మణ్, నల్లమోతు లక్ష్మీనారాయణ, మాదినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో సృజనాత్మకతను వెలికి తీయవచ్చు



**ప్రజాపక్షం/మధిర :** క్రీడలు ద్వారా తమలో ఉన్న క్రీడా ప్రతిభ, సృజనాత్మకతను వెలికి తీయవచ్చునని జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఇసిహెచ్ విద్యాసాగర్, జాయింట్ రిజిస్ట్రార్ డి.శివాజీ అన్నారు. ఆదివారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో భోదనేతర సిబ్బందికి నిర్వహించిన క్రీడల ముగింపు సభలో వారు ముఖ్యఅతిథిలుగా పాల్గొని మాట్లాడారు. అన్ని విషయాల్లో కూడా అశ్వారావుపేట కళాశాల వారు ఇచ్చే ఆతిథ్యం ఎప్పటికి కూడా అందరిని సంతృప్తిని కలిగిస్తుందని కొనియాడారు. ఈ పోటీల ద్వారా ఉద్యోగుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభ, సృజనాత్మక, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికి తీయడం లక్ష్యంగా పెట్టుకున్నామని, అందరుకూడా అంతే స్ఫూర్తితో పాల్గొని విశ్వవిద్యాలయం ఐక్యత, క్రీడా స్ఫూర్తిని చాటేలా వ్యవహరించాలని అన్నారు. ప్రతి వ్యక్తికి కూడా సంపద, విద్య, ఉద్యోగం, పిల్లలు, ఆస్తులతో పాటు ఆరోగ్యం చాలా అవసరమని, ఆరోగ్యమే మహాభాగ్యమని, ఈ వసతులు కల్పించడానికి మన విశ్వవిద్యాలయం సర్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం మూడురోజుల పాటు జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్ట జె.హేమంత్‌కుమార్, డాక్టర్ ఎం.రాంప్రసాద్, యూనివర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ కె.చేరిత్‌కుమార్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# బిల్డింగ్ వర్కర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల కేంద్రం బోనకల్‌లోని సిఐటియు కార్యాలయంలో బిల్డింగ్ వర్కర్ల సంఘం క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు బోయినపల్లి వీరబాబు, సిఐటియు మధిర డివిజన్ కార్యదర్శి మరీదు పుల్లయ్య ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘం మండల అధ్యక్షులు షేక్.బుజ్జి అధ్యక్షతన జరిగిన గ్రామ మహాసభలో వారు మాట్లాడుతూ .. ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం బోనకల్ గ్రామ సిఐటియు గ్రామ కన్వీనర్‌గా షేక్.బుజ్జి, కో కన్వీనర్‌గా అంతోటి రమేస్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఆళ్ళపాడు గ్రామ కన్వీనర్‌గా ఏ.తిరుపతయ్య, కో కన్వీనర్‌గా బలగాని నాగరాజు, రాయన్నపేట కన్వీనర్‌గా మరీదు మద్దయ్య, కో కన్వీనర్‌గా ఎ.నరేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ గుగులోతు నరేష్, బిల్డింగ్ వర్కర్ల సంఘం నాయకులు గుంటు శ్రీను, ఎస్కే.మీరా, రైతు సంఘం నాయకులు కుచిపూడి మురళీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా న్యూలిటిల్ ఫ్లవర్ 10వ వార్షికోత్సవం





**ప్రజాపక్షం/వైరా:** న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో దశమ వార్షికోత్సవంను ప్రముఖ నటుడు మోటివేషనల్ స్పీకర్ కొండపర్తి ప్రదీప్, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్ రావు, జ్యోతిప్రజ్వాలన చేసి దశ వసంతాల వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యూఇరా విద్యాసంస్థల చైర్మన్ ఐవి.రమణరావు, కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్‌లు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమత్, లగడపాటి ప్రభాకర్ మాట్లాడుతూ పాఠశాల స్థాపించిన మొదటి సంవత్సరం నంపడి ఇప్పటి వరకు అనునిత్యం మా వెంట ఉండి మన స్కూల్ అభివృద్ధిలో పాల్పంచుకుంటున్న తల్లిదండ్రులకు పేరుపేరున కృతజ్ఞలు తెలియజేశారు. న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రారంభమై పది వసంతాలను పూర్తి చేసుకొని దశాబ్ది వేడుకలను ఘనంగా జరుపుకోవడం ఒక మధుర జ్ఞాపకం ఈ క్రమంలో ఎన్నో సవాళ్ళు, మైలురాళ్లు అందుకోవడం జరిగింది. తల్లిదండ్రుల అభ్యర్ధన మేరకు జూనియర్‌కళాశాలను ప్రారంభించుకొని జాతీయస్థాయిలో నిర్వహించే జేఈఈ మెయిన్స్, నీట్, ఈఏపిసెట్ వంటి పోటీ పరీక్షలకు స్కూల్ నుండి మంచి ఫౌండేషన్‌ను అందించి వైరా ప్రాంతం నుండి మంచి ఫౌండేషన్‌ను అందించి వైరా ప్రాంతం నుండి ఐఐటిలను, డాక్టర్‌లను అందించిన ఘనత ఒక్క న్యూలిటిల్ ఫ్లవర్ వారిదే. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ప్రముఖ నటుడు మోటివేషనల్ స్పీకర్ కొండపర్తి ప్రదీప్, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, న్యూఇరా విద్యాసంస్థల చైర్మన్ ఐవి.రమణరావు, కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్లు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్, ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కల్లూరులో బిఆర్ఎస్ నిరసన



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని సిట్ ఇచ్చిన నోటీస్ కు నిరసనగా రాజకీయ దురుద్దేశంతో నోటిస్ ఇచ్చిందని కాంగ్రెస్ పార్టీ బొగ్గు కుంభకోణాన్ని బయటకు తీసి నందుకు రాజకీయంలో భాగంగా రాజకీయ లబ్ది కోసం ఈ పన్నాగం పన్నారని రాజకీయ దురుద్దేశంతోనే నోటీసులు ఇచ్చారని జిల్లా పార్టీ నాయకులు దిండిగల్ రాజేందర్ మాజీ జెడ్పిటిసి కట్ట అజయ్ కుమార్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పాలెపు రామారావు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# విద్య జీవితాన్ని మార్చే ఆయుధం : కలెక్టర్





**ప్రజాపక్షం/కొత్తగూడెం :** విద్య జీవితాన్ని మార్చే ఏకైక ఆయుధం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆదివారం జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న 16 వసతి గృహాల్లో 10వ తరగతి చదివే 212 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులను కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందేలా, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి డా.బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య జీవితాలను మార్చే ఏకైక ఆయుధం అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థానాల్లోకి ఎదగాలన్నారు. వీటన్నిటికి తొలిమెట్టు పదో తరగతి పాస్ కావడంతోనే ప్రారంభం అవుతుందని, విద్యార్థులు చదువులతో పాటు క్రమశిక్షణ, సమయ పాలన, పట్టుదల వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎస్సి విద్యార్థుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వార్డెన్ల సూచనలు పాటిస్తూ నిరంతర కృషితో ముందుకు సాగాలన్నారు. అనంతరం నిపుణులు మాట్లాడుతూ పాఠ్యాంశాలపై ఎలా పట్టు సాధించాలి, చదివిన అంశాలను ఎలా జ్ఞాపకం పెట్టుకోవాలని, పరీక్షలు రాసేసమయంలో సమయ పాలన ఎలా పాటించాలని, మంచిమార్కులు సాధించేందుకు చేయాల్సిన కృషి వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సి అభివృద్ధిశాఖ అధికారిణి శ్రీలత, సహాయ సంక్షేమ అధికారులు కొప్పుల హనుమంత రావు, సిహెచ్ అక్షయ్, జిల్లాలోని వసతి గృహాల సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఆర్‌విఆర్ ప్రసాద్, నర్సింహారావు, సాయి చరణ్, నాగలక్ష్మి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఖైదీల ఉపాధికి అగరబత్తీల తయారీ

- స్టాల్ ప్రారంభించిన జైలర్ ఉపేందర్






**ప్రజాపక్షం/భద్రాచలం :** విచారణ ఖైదీల ఉపాధి కోసం స్థానిక సబ్ జైల్లో అగరబత్తీల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేశారు. వాడిపోయిన పువ్వులతో తయారు చేస్తున్న ఆగరబత్తీలు ఎంతో సువసను వెదజల్లుతున్నాయి. ఖైదు పూర్తయిన అనంతరం ఇంటికి వెళ్లిన తర్వాత కూడా వారు దీనిని ఆసరగా చేసుకుని అగరబత్తీలు తయారీతో జీవనం సాగించేందుకు వీలుగా ఉంటుందని జైలర్ ఉపేందర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల ఖైదీల ప్రవర్తనలో మార్పు వస్తుందని, సమాజంలో మంచిపేరు తెచ్చుకుని జీవించేందుకు ఉపయోగ కరంగా ఉంటుందని జైలర్ అంటున్నారు. ఎలాంటి ఇతర నష్టాలు లేకుండా పూర్తి ఆరోగ్యకరమైన పదార్థాలతో, రామాలయంతో పాటు ఇతర దేవాలయాల నుండి సేకరించిన వాడిపోయిన పువ్వులతో అగరుబత్తీలను తయారు చేసి ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నారు. ఖైదీలు తయారు చేసిన ఆగరు బత్తీల స్టాల్‌ను రామాలయ పరిసరాల్లో విక్రయించేందుకు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వీటి విక్రయాల ద్వారా వచ్చిన ఆర్థికలాభాలు పూర్తిగా ఖైదీలకే అందుతాయని జైలర్ తెలిపారు.

# కెసిఆర్ సిట్ విచారణకు పిలుపుపై బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/మణుగూరు:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ విచారణకు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ పరిణామానికి నిరసనగా మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.ప్రభుత్వం రాజకీయ కక్షతోనే కేసీఆర్‌పై విచారణ పేరుతో వేధింపులకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని అక్రమ చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు."తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడిపై ఇలాంటి చర్యలు తగవు. ఇది పూర్తిగా రాజకీయ ప్రతీకారమే" అని రేగా కాంతారావు అంటూనిరసన తెలిపారు. ప్రజల మద్దతుతోనే కేసీఆర్ తిరిగి బలంగా రాజకీయ రంగంలోకి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు ప్రకటించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు.

# స్వరాష్ట్ర ఉద్యమ నేత కెసిఆర్‌పై రాజకీయ వేధింపులు సిగ్గుచేటు

మండల కేంద్రంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ నేత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పై సిట్ విచారణ పేరుతో రాజకీయ కక్షసాధింపులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని తిరుమలాయపాలెం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న తీవ్రంగా మండిపడ్డారు. పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు తాతా మధుసూదన్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు భాష బోయిన వీరన్న మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తుందని స్వరాష్ట్రం సాధన కోసం చావు చివరి వంచి వరకు పోరాడి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పై రాజకీయ కుట్రతో వేధిస్తున్నారని ఫోన్ టాపింగ్ పేరుతో సిట్ అధికారులు విచారణ చేయటం దురదృష్టకరమని ఆయన అన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే చేస్తున్నారని ఈ అరాచక పాలన రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా కేసీఆర్ కు రాష్ట్ర ప్రజల అండ ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ కార్యదర్శి దేవరం దేవేందర్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్, చావా, వేణుగోపాలకృష్ణ, పిండిప్రోలు ఉపసర్పంచ్ చామకూరి రాజు, మండల మైనార్టీ అధ్యక్షులు, గోల్ తండా ఉప సర్పంచ్ చందు షేక్, మాజీ చంద్రుతండా సర్పంచ్ బోడ మంచనాయక్, ఎంపిటీసీ పైనంపల్లి దారావత్ శంకర్ నాయక్, మండల సీనియర్ నాయకులు కొప్పుల శ్రీనివాస్ రావు, పోలే పొంగు వెంకటేశ్వర్లు, పోలే పొంగు రామ్ చంద్రు, వనవాసం వెంకట్ రెడ్డి, పోట్ల జగదీష్, గంట కృష్ణ, బానోత్ రవి, వీరబోయిన శ్రీనివాస్, పరికపల్లి చంద్రశేఖర్, ఫసలాది ముత్తయ్య, కొవ్వూరి సందీప్ రెడ్డి, బొల్లికొండ రమేష్, జక్కుల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# అందరి బంధువు లగడపాటి కష్ణ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి కమ్యూనిస్టు ఉద్యమంలో సిపిఐ పార్టీ అభివృద్ధిలో తీవ్రంగా కృషి చేసిన నాయకుడు అమరజీవి లగడపాటి కృష్ణ అని సిపిఐ రాష్ట్ర సంఘ సభ్యులు నరాటి ప్రసాద్ అన్నారు. ఆదివారం జగన్నాథపురం గ్రామంలో సిపిఐ మాజీ మండల కార్యదర్శి అమరజీవి లగడపాటి కృష్ణ 13వ వర్ధంతి సందర్భంగా స్మార్క స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆనాడు బూర్గంపాడు ఎంఎల్ఏగా ఊకే అబ్బయ్య, కుంజా బిక్షం పార్లమెంట్ సభ్యులుగా చూడరామయ్య ములకలపల్లి మండలంలో సిపిఐ పార్టీ కీలకంగా ఉన్న నేపథ్యంలో లగడపాటి కృష్ణ కృషి ఎంతో ఉందని కొనియాడారు. సిపిఐ పార్టీ మండలంలో విస్తరణకు లగడపాటి కృష్ణ కృషి చేశారని, అన్ని రాజకీయ పార్టీలతో స్నేహపూర్వకంగా ఉండేవారిని లగడపాటి కృష్ణ మరణం కమ్యూనిస్టు పార్టీకి తీవ్రమైన లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఎస్‌కే జబ్బర్, అనుముల సాయి, వీరు నాయక్, రంజిత్, ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు గాదగోని జగదీష్, టిడిపి మండల నాయకులు ప్రసాద్, పామర్తి కృష్ణ, లగడపాటి నరసింహారావు, రఘు, ప్రగడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సిఎం దిష్టిబొమ్మ దహనం చేయనివ్వం



**ప్రజాపక్షం/మణుగూరు:** సీఎం దిష్టిబొమ్మను తగలబెట్టే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిరినకి నవీన్ స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ప్రతిష్టను దెబ్బతీసేలా కొందరు కావాలనే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుంటే, రాజకీయ లబ్ధి కోసం కొందరు అశాంతి సృష్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలకు కాంగ్రెస్ పార్టీ గట్టిగా ప్రతిఘటిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలు చేపడితే, పార్టీ శ్రేణులు శాంతియుతంగా అడ్డుకుంటాయని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి చర్యలకు మద్దతు ఇవ్వకుండా చైతన్యవంతులుగా ఉండాలి అన్నారు.

# సాగర్ బ్లడ్ బ్యాంక్ ద్వారా ఉచిత రక్తదానం

**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలం మోతె గ్రామానికి చెందిన మెంతిని సాగర్ గారుసాగర్ బ్లడ్ బ్యాంక్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ ద్వారా ఉచితంగా రక్తదానం సేవలు చేస్తున్నామని సాగర్ బ్లడ్ బ్యాంక్ వెల్ఫేర్ అసోసియేషన్ (పౌండర్ అండ్ అధ్యక్షులు) మెంతిని సాగర్ అన్నారు. ఈ రోజుల్లో ఎక్కడ చూసిన ఏదో ఒకరూపం లో ఎవరికో ఒకరికి బ్లడ్ అవసరం వస్తుంది, కానీ ప్రజలు రక్తదానం చేయడానికి భయపడుతున్నారు, రక్తదానం పట్ల ప్రజలు దురాభిప్రాయం కలిగి ఉండటం వెనుకడుతున్నారని, ఫలితంగా యాక్సిడెంట్ కు గురైన వారు, గర్భిణులు,ఆపరేషన్లు, తలసేమియా, క్యాన్సర్ బాధితులు ఇతర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు సకాలంలో రక్తం దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, కావున 18 ఏండ్ల నుంచి 60 ఏండ్ల మధ్యలో ఆరోగ్యవంతులు ఎవరైనా రక్తదానం చేయొచ్చు అన్నారు. ఒక వ్యక్తి తన జీవితకా లంలో 168 సార్లు రక్తదానం చేయొచ్చని తెలిపారు. రక్తదానం చేయడంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కొత్త రక్త కణాలు పుట్టించుకునే శక్తి లభిస్తుందని, హార్ట్ ఎటాక్, క్యాన్సర్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందన్నారు. ప్రజలు అందరూ అపోహాలు వీడిసి రక్తదానం చేయడానికి అందరూ ముందుకు వస్తే, మనం అందరం కలిసి చాలామంది ప్రాణాలు కాపాడవచ్చు అన్నారు. ఈ రోజుల్లో ఎవరికో ఒకరికి బ్లడ్ అవసరం వస్తుంది, వాళ్ళకు బ్లడ్ దొరకక ఎన్ని ఇబ్బందులు పడి ఉంటామో చూసే ఉంటాము, కనుక వాళ్ళసమస్యనిమనసమస్యగాఅనుకోనిరక్తదాతలుముందుకురాగలరుఅని పిలుపునిచ్చారు.

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారణ పేరుతో వేధింపులకు గురి చేయడం కక్ష సాధింపు చర్యేనని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఆత్మ కమిటీ ఛైర్మన్ ముత్యాల సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం సింగరేణి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్‌లో ఖమ్మం ప్రధాన రహదారిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరికించేందుకు సిట్ అధికారులు విచారణ చేయడం సరైన పద్ధతి కాదని, ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేస్తూ మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. దాదాపు గంట వరకు సాగిన ఈ రాస్తారోకోలో ముత్యాల మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చేందుకు కేసీఆర్‌పై విచారణ చేస్తున్నారని విమర్శించారు. రైతులకు యూరియా సరఫరా చేయడంలో విఫలమైన ప్రభుత్వం, గిట్టుబాటు ధర, రైతు భరోసా ఇవ్వకుండానే రైతులను మభ్యపెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ రాస్తారోకోలో మాజీ జెడ్‌పిటిసిలు ఉన్నం వీరేందర్, వంకుడోత్ జగన్ నాయక్, కొత్త తండా సర్పంచ్ ధారావత్ మంగీలాల్, తాత వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు బానోతు రాందాస్, జరపల హచ్చు, బానోత్ శంకర్, బానోతు మోహన్, నాయకులు డొంకెన రవీందర్, తెలగర్ల రామారావు, మణికొండ నాగేశ్వరరావు, మాలోతు పడిత్యా, తాత ఉపేందర్, గుగులోత్ రవి, బట్టు శ్రీను, బానోతు రాంపండు, షేక్ కాజా, షేక్ సైజ్ జాన్, మంగ్య, పురం అంజయ్య, దొంతు దాస్, సురభి సాగర్, రేఖ ప్రసాద్, షేక్ పాషా, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు గురు, శిష్య హస్త శిల్ప శిక్షణ కార్యక్రమం

**-జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**





**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల పరిధిలోని మాదారం గ్రామంలో ఏర్పాటు చేసిన నాయకపోడు మాస్కుల తయారీ యూనిట్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా యూనిట్‌లో తయారవుతున్న నాయకపోడు మాస్కుల తయారీ ప్రక్రియను పరిశీలించి, కళాకారులతో పరస్పరంగా మాట్లాడి వారి అనుభవాలు, సమస్యలు, అవసరాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదారం గ్రామంలో తయారవుతున్న నాయకపోడు మాస్కులు నాయకపోడు సంస్కృతి, సంప్రదాయ కళలకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకువచ్చాయని తెలిపారు. ఈ సంప్రదాయ హస్తకళను పరిరక్షిస్తూ మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పాటు, మండలంలో ఉన్న నాయకపోడు నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో గురు, శిష్య హస్త శిల్ప శిక్షణ కార్యక్రమంను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమం సోమవారం నుండి ప్రారంభమవుతుందని, తొలి దశలో 30 మంది నాయకపోడు నిరుద్యోగ యువతీ, యువకులతో రెండు నెలలపాటు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే ప్రతి శిక్షణార్థికి రోజుకు రూ 300 చొప్పున స్కాలర్ షిప్ అందజేయబడుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో సంప్రదాయ నాయకపోడు, మాస్క్ తయారీతో పాటు నాణ్యత మెరుగుదల, ఆధునిక డిజైన్‌లు, మార్కెటింగ్ అంశాలపై కూడా ప్రాయోగిక అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం శిక్షణార్థులు స్వయం ఉపాధి, ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు ఏర్పా టు చేసుకునేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ద్వారా అందజేస్తామన్నారు. సంప్రదాయ హస్తకళలకు మార్కెట్ అవకాశాలు పెంచడంతో పాటు స్థానిక యువతకు స్థిరమైన ఉపాధి కల్పించడమే ఈకార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి డీఆర్‌డీఏ నుండి ఏపీఎం ఆర్ ఉపేందర్ పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. మాస్టర్ క్రాఫ్ట్ పర్సన్ అంజన్ కుమార్ శిక్షణను అందిస్తారని, గురు, శిష్య విధానంలో ప్రాయోగికంగా నైపుణ్యాలు నేర్పిస్తారని వెల్లడించారు. ఈకార్యక్రమంలో మాస్టర్ క్రాఫ్ట్ పర్సన్ అంజన్ కుమార్, డీఆర్‌డీఏ ఏపీఎం రామ్ కుమార్, సీసీ ఉపేందర్, మాస్క్ తయారీ, యూనిట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్‌నగర్‌లో దద్దరిల్లిన సిపిఐ ప్రచార హోరు

**- గడగడపకు వెళ్లి కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని ఓటర్లను కోరిన అభ్యర్థి దండి రంగారావు**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ, 28వ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్‌లో అక్కడి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రచార హోరు దద్దరిల్లింది. ఎర్రజెండాల రెపరెపలన డుమ, డప్పు శబ్దాలు, జై సిపిఐ నినాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది.ఈ సందర్భంగా సిపిఐ అభ్యర్థి దండి రంగారావు గడగడపకు వెళ్లి ఓటర్లను కంకికొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఓటు కోసం ఈరోజు మీ ముందుకు వచ్చిన వ్యక్తిని కాదని, నిత్యం మీ మధ్యలో ఉన్ననన్నారు. ఈ ప్రాంతంలో సిపిఐ పార్టీగా సర్వీస్ అందిస్తూ ప్రజల తలలో నాలుకగా సేవలు అందించినట్లు తెలిపారు. మున్ముందు కూడా ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించడంతో పాటు ప్రజల కష్టసుఖల్లో ఉంటానని నిండుమనసుతో నా అభ్యర్థిత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ ప్రచారం సొంతం ప్రజల దీవెనలు, పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు, చిన్నారుల సాక్షిగా ఉత్సాహభరితంగా సాగింది.

# సామాన్యులను విస్మరించిన కేంద్ర బడ్జెట్

**-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులను పూర్తిగా విస్మరించారని సంపన్న వర్గాలను ప్రోత్సహించేలా ఉందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు ఈ బడ్జెట్‌లో ఎక్కడ పరిష్కారం చూపే ప్రయత్నం చేయలేదన్నారు. మోడీ ప్రభుత్వం కార్పోరేట్, సంపన్న వర్గాలకు అనుకూలమని ఈ బడ్జెట్‌తో మరోసారి రుజువైందన్నారు. ఉద్యోగ, ఉపాధి రంగాలకు సంబంధించి బడ్జెట్‌లో ప్రస్థావించ లేదన్నారు. అంకెల గారెడీ తప్ప వాస్తవానికి దూరంగా బడ్జెట్ ఉందన్నారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చి విబి జి రామ్ జీ పేరుతో నిధులు కేటాయించిన రాష్ట్రాలు 40 శాతం భరించాలని చెప్పడం దుర్మార్గమన్నారు. బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలను విస్మరించారన్నారు. దేశంలో ఎక్కువ మంది ప్రజలు ఆధారపడి ఉన్న వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించి సరైన కేటాయింపులు జరపలేదన్నారు. అంకెల్లో బడ్జెట్‌ను రూ. 53 లక్షల కోట్లు చూపారు తప్ప ఆదాయ మార్గాలను చూపడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కార్మిక వర్గాన్ని కూడా ప్రభుత్వం బడ్జెట్‌లో విస్మరించిందన్నారు. తెలంగాణ పట్ల కేంద్రం మరోసారి వివక్ష ప్రదర్శించిందని బడ్జెట్‌లో సరైన రీతిలో కేటాయింపులు జరపలేదన్నారు. ఈ బడ్జెట్‌తో సామాన్య ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని ఆయన తెలిపారు.

# కేంద్ర బడ్జెట్‌తో ఖమ్మం జిల్లాకు నిష్ప్రయోజనం

**-సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కేంద్ర బడ్జెట్‌తో ఖమ్మం జిల్లాకు ఎటువంటి ప్రయోజనం లేదని ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్లను పట్టించుకోలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వికసిత్ భారత్ లక్ష్యంతో రూ.53.5 లక్షల కోట్లతో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ ప్రజా వ్యతిరేకమని కార్పోరేట్ శక్తులకు మేలు చేసేలా ఉందన్నారు. బడ్జెట్‌లో జిల్లాకు ఎటువంటి కేటాయింపులు లేవని, బయ్యారం ఉక్కు పరిశ్రమ, జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ, నవోదయ పాఠశాలలు వంటి అంశాలను విస్మరించారన్నారు. వ్యవసాయ రంగానికి నిధులు కొంత పెంచినా ఎరువుల సబ్సిడీలో కోత విధించడం రైతులపై భారం మోపుతుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు నిధులు తగ్గించారన్నారు. సామాన్యుల అవసరాలను పక్కన పెట్టి బడా కార్పోరేట్ సంస్థల అవసరాల కోసమే బడ్జెట్‌ను రూపొందించారన్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించే చర్యలు బడ్జెట్‌లో కనిపించలేదన్నారు. సామాన్య ప్రజల కష్టాలను పట్టించుకోలేదని సంక్షేమ కోతలు విధించారన్నారు. ఆహార భద్రత, ఆరోగ్యం, విద్య, గృహ నిర్మాణం వంటి కీలక రంగాలకు కేటాయింపులు తగ్గించారని ఆయన ఆరోపించారు. పెరుగుతున్న నిరుద్యోగాన్ని తగ్గించడానికి ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదన్నారు.

# కార్పోరేట్లకు అనుకూల బడ్జెట్


**-సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అంకెలు, మేడిపండు మాటలు, తేనె పూతతో ప్రజలను ఏమార్చి కార్పోరేట్ వర్గాలకు అనుకూలంగా పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. రాష్ట్రాలకు మొండి చేయి చూపించి పాత నిధులనే కేటాయించి ఫెడరల్ విధానాన్ని అపహాస్యం చేశారన్నారు. కార్పోరేట్ వర్గాల భవిష్యత్తు కర్తవ్యాలను నెరవేర్చే కృషిలో డేటా సెంటర్ల ఏర్పాటుకు భారీ పెట్టుబడులకు ప్రోత్సహ మిచ్చారన్నారు. చిన్న పరిశ్రమలకు రూ. 10వేల కోట్లు కేటాయించి ఊసురుమనిపించారన్నారు. వ్యవసాయ రంగానికి, విద్య, వైద్య రంగాలకు అదనంగా కేటాయించింది ఏమి లేదన్నారు. మౌలిక వనరులంటూ సంక్షేమ కార్యక్రమాలకు కోత మొదలైందని, ఉద్యోగాల కల్పనకు కొత్త అవకాశాలు లేవన్నారు. తెలంగాణకు సాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఏ మాత్రం ప్రయత్నించ లేదన్నారు. రాష్ట్రాల నుంచి పన్నులు వసూలు చేసుకుంటూ రాష్ట్రాలకు మాత్రం అరకొరగా నిధులు ఇవ్వడం అన్యాయమన్నారు.

# తెలంగాణపై వివక్ష

**-తాతా మధు**



**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర బడ్జెట్ తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా విస్మరించిందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చి చూసినప్పుడు తెలంగాణకు పూర్తి స్థాయిలో అన్యాయం జరిగినా కాంగ్రెస్ స్పందించకపోవడం వెనక బిజెపి, కాంగ్రెస్ లోపాయికారితనం అవగతమవుతుందని ఆయన అన్నారు. బడ్జెట్‌పై స్పందిస్తూ ఎప్పటి మాదిరిగానే బిజెపి కార్పోరేట్‌లకు కొమ్ము కాసిందని మధు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించిందని రసాయనిక ధరలు పెరిగే అవకాశం ఉందని దీనితో వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోయే అవకాశం ఉందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల గురించి ప్రస్థావన బడ్జెట్‌లో లేదని ఆయన తెలిపారు. స్వేచ్ఛను హరించే రీతిలో బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. అంకెల గారడీ చేశారు తప్ప వాస్తవ అమలుకు ఈ బడ్జెట్ చాలా దూరంగా ఉందని మధు స్పష్టం చేశారు.

# పొట్రు రామారావు కుటుంబాన్ని పరామర్శ



**ప్రజాపక్షం/తల్లాడ :** ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని నూతనకల్లు గ్రామానికి చెందిన పోట్రు రామారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయులు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఆయన మృతి గల కారణాలను అడిగి తెలుసుని ధైర్యంగా ఉండాలని ధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుతుంబాక మహేంద్రకుమార్, గ్రామ మాజీ సర్పంచ తూము శ్రీనివాసరావు, నాయుడు శ్రీనివాసరావు, సీతారామిరెడ్డి, చిత్తా నాగేశ్వరరావు, ఉపేంద్ర, అనీల్, సాయి, మురళీ, వేణు తదితరులు పాల్గొన్నారు.

# విఆర్ బంజరలో మసీదు ప్రారంభం



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని విఆర్ బంజర గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీదును ప్రారంభించారు. ఆదివారం గ్రామంలో జరిగిన మసీదు ప్రారంభోత్సవంలో రఘునాథపాలెం సిఐ ఎండి ఉస్మాన్ షరీఫ్ ముఖ్య అతిథిగా హాజరై మసీదును ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మతసామరస్యం, సోదరభావం, శాంతియుత సహజీవనం మన సమాజానికి అత్యంత ఆవశ్యమన్నారు. అన్ని మతాల ప్రజలు ఐక్యతతో కలిసిమెలిసి జీవించడమే దేశ ప్రగతికి మూలమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా రమణ, ముల్సాబ్, ముస్లిం సోదరులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్దిదారులకు మంజూరైన చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య కారణాలతో చికిత్సలు పొంది ఆర్థిక భరోసా కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మండల పరిధిలోని వేపకుంట్ల, చెరువుకొమ్ముతండా గ్రామాల్లో లబ్దిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెరువుకొమ్ము తండా సర్పంచ్ భూక్యా భాషా, నాయకులు రేమళ్ల రమేష్, చల్లగుండ్ల శ్రీనివాసరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.